క్లుప్తంగా

నేడు మంత్రి కాకాణి పర్యటన

మనుబోలు: మండలంలోని ముద్దుమూడి, చెరుకుమూడి గ్రామాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం పర్యటించనున్నారు. తొలుత ముద్దుమూడిలో సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలను ప్రారంభిస్తారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు చాంద్ బాషా, కూరపాటి మోహన్ ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మర్యాదపూర్వకంగా..



బుచ్చిరెడ్డిపాళెం: ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరులోని నివాసంలో వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంక్ చైర్‌పర్సన్ యర్రంరెడ్డి స్వర్ణ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీను శాలువాతో సత్కరించి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా నూతన చైర్‌పర్సన్‌ను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అభినందించారు. విజయడెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్సీ



నెల్లూరు(సెంట్రల్): ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సురేష్

నెల్లూరు(బారకాసు): బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్ అందజేశారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణకు వినతి

నెల్లూరు (టౌన్): నగరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

నెల్లూరు (టౌన్): పాలిసెట్ రాయనున్న విద్యార్థుల కోసం వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణను సోమవారం నుంచి నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ సుధాకర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణను నిర్వహించనున్నామని చెప్పారు. వివరాలకు 91820 63830, 94923 37539 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రౌడీషీటర్ అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిని కత్తితో బెదిరించి నగదును దోచుకెళ్లిన ఘటనలో రౌడీషీటర్‌ను సంతపేట పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గోమతినగర్‌కు చెందిన విజయ్‌కుమార్ ఏసీ సెంటర్‌లోని పీకాక్ రెస్టారెంట్ అండ్ బార్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. బార్ వద్ద కపాడిపాళెం పెద్దబావి సెంటర్‌కు చెందిన రౌడీషీటర్ సాగర్ అతడ్ని కత్తితో చంపుతానని బెదిరించి రూ.వెయ్యిని శనివారం దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కనకమహల్ సెంటర్ వద్ద సాగర్‌ను అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ కల్యాణ్‌రాజు తెలిపారు.

భగవద్రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో భగవద్రామానుజాచార్యుల అవతార మహోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. తిరుమంజనం, పేట ఉత్సవం, సేవా కాలం, శాత్తుమొరైను నిర్వహించారు. ఉభయకర్తగా ఆదెమ్మ వ్యవహరించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నాడు-నేడు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకం ద్వారా రాష్ట్రంలోని పాఠశాలలు, వసతిగృహాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గొలగమూడిలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలికల వసతిగృహంలో నాడు-నేడు పథకం కింద రూ.61.71లక్షలతో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులను ఆదివారం సాయంత్రం మంత్రి కాకాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో విద్యార్థులకు కనీస వసతులు కరువయ్యాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోట్లాది రూపాయలతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కొండల్‌రావు, ఎంపీడీఓ సుస్మిత, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కోడూరు ప్రదీప్ కుమార్‌రెడ్డి, నంబూరు రాజానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పొదలకూరు : అప్రమత్తతతో అగ్నిప్రమాదాలను నివారించవచ్చని పొదలకూరు అగ్నిమాపక అధికారి వరకుమార్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆచారి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న మహిళలకు అగ్నిప్రమాదాలపై ఆదివారం అవగాహన కల్పించారు. వంటగ్యాస్ కారణంగా సంభవించే అగ్నిప్రమాదాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. వంట చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్యాస్ లీకై మంటలు వ్యాపించిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుడికి ఆర్థిక సాయం



కల్లుగీత కార్మికుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రభాకరగౌడ్

పొదలకూరు : మండలంలోని బిరదవోలుకు చెందిన కల్లుగీత కార్మికుడు కైతేపల్లి శ్రీనివాసులుకు జిల్లా గౌడ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్ ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కల్లుగీస్తూ చెట్టుపై నుంచి పడి గాయపడిన శ్రీనివాసులకు జిల్లా గౌడ్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత కోసూరు గోవిందయ్య ఆశయసాధన మేరకు నగదు సాయం అందజేసినట్లు ఆయన తెలిపారు. బిరదవోలు ఎంపీటీసీ రావుల దశరథరామయ్యగౌడ్, గౌడ్ సేవా సమితి బాధ్యులు తాళ్ల రాజాగౌడ్, రామకృష్ణగౌడ్, శ్రీనివాసులుగౌడ్, ఇంద్రసేన్‌గౌడ్, అన్నం సుబ్బారావుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాదం పంపిణీకి నగదు విరాళం



నగదు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయంలో అన్నప్రసాదం పంపిణీకి నెల్లూరు చెందిన గాదం విశ్వనాథ్, అమ్మణ్ణమ్మ దంపతుల కుమారుడు, కోడలు అమరనాథ్, తులసి రూ.25 వేలు నగదు విరాళం ప్రకటించారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఈఓ బండి శాంతయ్యకు నగదు అందజేరు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ కొండూరు కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తీరనున్న లోఓల్టేజీ సమస్య



తోడేరులో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్

పొదలకూరు : మండలంలోని తోడేరులో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. తోడేరుతో పాటు అయ్యగారిపాళెం, నందివాయ, పొదలకూరు శివారు ప్రాంతంలో లోఓల్టేజీ సమస్యతో వ్యవసాయ మోటార్లు సక్రమంగా పనిచేయక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను రైతుల ద్వారా తెలుసుకున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పందించారు. తోడేరులో స్థలాన్ని చూపడంతో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2 కోట్లు విడుదల చేయించారు. దీంతో శరవేగంగా నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే దాదాపుగా సబ్‌స్టేషన్ పనులను పూర్తి చేశారు. స్వల్పంగా మిగిలి ఉన్న పనులను పూర్తి చేస్తున్నారు. ఆదివారం పనుల పురోగతిని విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్స్ ఏడీఈ ప్రభాకర్‌రావు పొదలకూరు ఆపరేషన్స్ ఏడీఈ సురేంద్రబాబుతో కలిసి పరిశీలించారు. వచ్చే నెల 7న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి చార్జ్ చేయాలనే యోచనలో విద్యుత్ అధికారులు ఉన్నారు. సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే తోడేరు పరిసర గ్రామాల్లోని రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందనుంది.

రేపు శివాలయంలో అన్నాభిషేకం

పొదలకూరు : పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 8 గంటలకు తొలిసారిగా అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు ప్రసాద్‌స్వామి ఆదివారం తెలిపారు. దేవాదాయశాఖ అధికారులు, చైర్మన్, వేదపండితుల పర్యవేక్షణలో మహాన్యాసపూర్వక ఏకదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

లోకేష్ భేషరతుగా క్షమాపణ చెప్పాలి



బుచ్చిరెడ్డిపాళెం: దళితుల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడడం టీడీపీ నాయకుడు నారా లోకేష్‌కు తగదని, దళితులకు భేషరతుగా ఆయన క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్‌సీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బట్టా విల్సన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న లోకేష్ నోటికి అడ్డూ అదుపులేకుండా దళితులు ఏమి పీకారని మాట్లాడడం దారుణమన్నారు. గత ఎన్నికల్లో టీడీపీకి దళితులు తగిన బుద్ధి చెప్పారని, వచ్చే ఎన్నికల్లోనూ అదేవిధంగా చెప్పడం ఖాయమన్నారు. దళితులకు వెంటనే లోకేష్ క్షమాపణలు చెప్పాలని, లేకపోతే తీవ్రస్థాయిలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ఉచిత వైద్యశిబిరం



కోవూరు(విడవలూరు): విడవలూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎయిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. న్యూరో సర్జన్ హేమలతారెడ్డి రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పూండ్ల అచ్యుతరెడ్డి, ఎంపీపీ భవానమ్మ, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్ రెడ్డి పాశం శ్రీహరిరెడ్డి, వేనాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(విడవలూరు): రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదల అభివృద్ధికి సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా, వాటిని సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా గడప గడపకు చేరవేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విడవలూరులోని సచివాలయం-2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పాలనపై ఆరాతీశారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు గడప గడపకు చేరడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏ ఇంటికి వెళ్లిన ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పూర్ణఅచ్యుత్‌రెడ్డి, స్థానిక నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వసంతోత్సవం



ఎడ్ల బండిపై ఆదిదంపతుల గ్రామోత్సవం

మనుబోలు: మండలంలోని సంగమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ నెల 14న సంగమేశ్వరాలయంలో సంగమేశ్వరస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించిన విషయం తెలిసిందే. మనుబోలులోని శివాలయానికి చేరుకున్న ఆదిదంపతులకు అర్చకులు సాయిశర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివ పార్వతుల ఉత్సవమూర్తులను ఎడ్ల బండిపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదేవేరులపై భక్తులు వసంతం చల్లారు. చిన్నారులు, యువతీ యువకులు ఒకరిపై ఒకరు వసంతం చల్లుకుని కేరింతలు కొట్టారు. శనివారం రాత్రి పార్వేట కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

చేపల వేటకు విరామం



కృష్ణపట్నం తీరంలో ఒడ్డుకు చేరిన పడవలు

ముత్తుకూరు: మండలంలోని తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకారులు వేటకు విరామం ప్రకటించారు. సముద్రంలో చేపలు, రొయ్యలు గుడ్లు పెట్టి పిల్లలు ఉత్పత్తి చేసే సీజన్ కావడంతో ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు వేటపై నిషేధం విధించారు. దీంతో మత్స్యకారులు పడవలు, వలలను ఒడ్డుకు చేర్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. కృష్ణపట్నం, నేలటూరు, వెంకనపాళెం, తదితర గ్రామాల్లోని మత్స్యకారులు ఇళ్లకే పరిమితమయ్యారు. వలలను సరిచేసుకోవడంలో నిమగ్నమయ్యారు. వేట నిషేధంతో ఉపాధి కోల్పోతున్న గంగపుత్రుల ఖాతాల్లో మత్స్యకార భరోసా పథకం కింద ప్రభుత్వ రూ.10వేలు జమచేయనుంది. ఇందుకు సంబంధించి లబ్ధిదారుల వివరాలను సేకరించేందుకు మత్స్యశాఖ రంగంలోకి దిగింది.

కుల వ్యవస్థలో అసమానతలు తొలగిపోవాలి



చిత్రపటాన్ని అందజేస్తున్న కమలానందభారతి

నెల్లూరు(బృందావనం): కుల వ్యవస్థలో అసమానతలు తొలగిపోవాలని హిందూ దేవాలయ ప్రతిష్ఠాపన పీఠాధిపతి, గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి పేర్కొన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులతో ఇష్టాగోష్ఠి సమావేశాన్ని కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని అతిథి గ్రాండ్‌లో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాచీన కాలంలో వర్ణాంతర వివాహాలు, నేటి కులాంతర వివాహాలు ధర్మ సమ్మతమేనని చెప్పారు. సమాజంలో కొందరు తమ కులవృత్తులపై అనుసరిస్తున్న విధానాలతో పలువురు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన దంపతులకు అరుంధతి, వశిష్టుల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ శ్యామ్‌ప్రసాద్, శ్రీధర్, కేశవులు, జయప్రద, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కృష్ణమూర్తి



నెల్లూరు(బృందావనం): బహుముఖ ప్రజ్ఞాశాలిగా నేలనూతల కృష్ణమూర్తి గడించిన కీర్తి ప్రతిష్ఠలు అనన్యసామాన్యమైనవని నెల్లూరు రామకృష్ణ సేవా సమితి ఉపాధ్యక్షుడు సాయికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కృష్ణమూర్తి జయంతిని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పద్యకళాపరిషత్ అధ్యక్షుడు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ సమన్వయకర్త బలరామయ్యనాయుడు, రమణయ్య, ప్రముఖ సాహితీవేత్త పురుషోత్తం, వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



గుండాలమ్మపాళెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



కోవూరు: బుక్‌లెట్లను అందజేస్తున్న గంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి



టీపీగూడూరు: పార్టీ నాయకులకు బుక్‌లెట్లను అందజేస్తున్న గృహసారథులు

కొడవలూరు: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య పేర్కొన్నారు. గుండాలమ్మపాళెంలో ఆదివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సచివాలయ కన్వీనర్లు నాగేంద్రప్రసాద్‌రెడ్డి, మధుసూదన్‌రావు, గృహసారథి డేగా శివకుమార్ పాల్గొన్నారు. అలాగే బసవాయపాళెంలో సర్పంచ్ పెల్లేటి రజని ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పెల్లేటి సతీష్‌రెడ్డి, ఉపసర్పంచ్ మహిధర్, వలంటీర్ కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు ప్రతిగ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. గంగవరం పంచాయతీ పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. అందుకు సంబంధించిన బుక్‌లెట్‌లను సర్పంచ్ లక్ష్మీకుమారి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం అందజేశారు.

మనుబోలు: ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నాలుగేళ్ల పాలనలోనే నెరవేర్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని చూరగొన్నాడని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. జట్లకొండూరు అరుంధతీయవాడలో ఉపసర్పంచ్ ఆవుల తులసీరాం ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో కలిసి బొమ్మిరెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సురేష్, రవీంద్ర, శ్యామల, ఏడుకొండలు, మల్లి, పుష్ప, సునీల్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. వరకవిపూడి సచివాలయం పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. సచివాలయం పరిధిలోని ప్రజల నుంచి సేకరించి అభిప్రాయాల బుక్‌లెట్లను గృహసారథులు పార్టీ నాయకులు ఇసనాక రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, మండల సచివాలయాల కన్వీనర్ తలమంచి సురేంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఇసనాక రమేష్‌రెడ్డి మాట్లాడుతూ జగననే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. పార్టీ నాయకులు కూరపాటి కృష్ణారెడ్డి, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



మనుబోలులో..